నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 12 సెప్టెంబర్ 2024 | HYDERABAD



**నీడపోయినా.. ఆగని జీవనపోరాటం**
మాదాపూర్ సున్నం చెరువు వద్ద గుడిసెలు కూల్చివేసినా.. వలస జీవుల జీవనపోరాటమిది



**అయ్యో..బిడ్డా! ఎటు పోదాం..!!**
సున్నం చెరువు వద్ద అక్షరాల్లో వర్ణించలేని బాధకు అద్దంపడుతున్నదీ దృశ్యం

*'ముందస్తు సమాచారం ఇవ్వలే.. బుల్డోజర్లతో బలం చూపిండ్రు.. గుడిసెలను గుల్లగుల్ల చేసిండ్రు..సామాన్లన్నీ ఆగమాగం అయినయ్..నిల్వనీడలేక..రోడ్డు మీద పడ్డం..నిద్ర లేదు.. నీళ్లు లేవు.. ఎంతటి కష్టం వచ్చినా.. ఇక్కడే ఉంటాం.. మాకు వేరే దారి లేదు.. ఎక్కడికి వెళ్లినా..వేలల్లో అద్దెలు.. ఇంట్లో వారందరం కష్టపడితే వచ్చేది అంతంత మాత్రమే...మా స్వగ్రామానికి వెళ్దామంటే అక్కడ ఏ పని దొరకదు.. వంటలు వండుకుందామంటే సామాన్లు కూడా ధ్వంసమయ్యాయి...మా గుడిసెలు కూల్చి..రేవంత్ సర్కారు మా బతుకులను ఆగం చేసింది.. సున్నం చెరువు వద్ద హైడ్రా గుడిసెల కూల్చివేతలతో నిల్వనీడ కోల్పోయిన నిరుపేద కూలీల ఆవేదన ఇది. పొట్టకూటి కోసం వలసవచ్చి.. జీవనం సాగిస్తున్న వారి బతుకులు చెల్లాచెదురయ్యాయి. ఉండేందుకు నీడ లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో గుడిసెలు కూల్చిన చోటే.. ఉంటూ.. దుస్తులు అడ్డంగా పెట్టి.. వంటలు చేసుకుంటూ..పిల్లల ఆకలి తీర్చుతున్న దృశ్యాలు స్థానికుల హృదయాలను పిండేస్తున్నది. గుడిసెవాసుల్లో సీఎం సొంత నియోజకవర్గమైన కొండగల్ కూలీలే అధిక సంఖ్యలో ఉండగా, వారంతా ఇప్పుడు రేవంత్‌పై దుమ్మెత్తిపోస్తున్నారు. తమకు తలదాచుకునేందుకు సర్కారే దారి చూపాలని వేడుకుంటున్నారు.*

*- సిటీబ్యూరో/మాదాపూర్, సెప్టెంబర్ 11*

### భార్య పుస్తెలతాడు కుదవపెట్టి..

ఏ ఉద్యోగం లేకపోవడంతో మా ఇల్లు పక్కనే ఉన్న వ్యక్తి పది రోజుల కిందట అతడి భార్య వద్ద పుస్తెల తాడు కుదవబెట్టి వాటర్ ప్లాంట్ పెట్టుకున్నాడు. అతడికి చాలా అప్పులు ఉన్నాయి. ఉద్యోగం వస్తుందని నమ్మకం లేక.. ఏదైనా వ్యాపారం చేయాలనే ఉద్దేశంతో వాటర్ ప్లాంట్ పెట్టుకున్నాడు. నేను వాచ్‌మెన్‌గా ఉన్న బిల్డింగ్‌కు కూడా నోటీసులు ఇచ్చారు.. వారం రోజుల్లో ఖాళీ చేయాలని.. ప్రస్తుతానికి అందులో ఉన్న నాలుగు కుటుంబాలకు చెందిన యజమానులు తాళాలు వేసి వెళ్లారు. **- గానయ్య, కూలీ**

### ఆకలితో అలమటిస్తున్నారు..

సర్కార్ చేసిన నిర్వాకంతో వంట సామాన్లు మొత్తం ధ్వంసమయ్యాయి. వంట వండుకోవడానికి సామాన్లు లేకపోవడంతో పిల్లలకు కనీసం వంట వండి పెట్టలేని పరిస్థితి. రాత్రంతా ఏడుస్తూనే ఆకలితో పడుకున్నారు. పక్కన వారు వంట వండితే అందులో నుంచి పిల్లలను చూసి కాస్త అన్నం పెట్టగా చాలీచాలినంత దానితో సరిపెట్టుకొన్నాం. రాత్రి సరిగా నిద్రలేక వర్షం పడితే ఏడపడుకోవాలో అర్థం కాక ఎప్పుడు వర్షం వస్తుందో అనే భయంతో ఏమి చేయాలో తోచక కంటిమీద కునుకు లేకుండా అలాగే ఉండిపోయాం. **- లక్ష్మి, కూలీ**






# • హైడ్రా పిడుగు..
# బతుకులు చెల్లాచెదురు

ముందస్తు సమాచారం ఇవ్వలే..
సామాన్లు సర్దుకోనివ్వలే..
బుల్డోజర్లతో బలం చూపిండ్రు..
గుడిసెలను గుల్లగుల్ల చేసిండ్రు..
సామాన్లన్నీ ఆగమాగం అయినయ్
నిల్వ నీడలేక.. రోడ్డుమీద పడ్డం
నిద్రలేదు.. నీళ్లు లేవు
ఆకలితో అలమటిస్తున్నం
పిల్లల బాధలు చూసి ఏడుస్తున్నం
బట్టలనే అడ్డం పెట్టి వంట
ఎటు పోవాలో దిక్కుతోచని దుస్థితి
కూలీలంటే ఇంత చులకనా..!

## రేవంత్ సర్కార్‌పై సున్నం చెరువు బుల్డోజర్ బాధితుల ఆవేదన

### కేసీఆర్ హయాంలో చేతి నిండా పని

'కేసీఆర్ ప్రభుత్వంలో కూలీలకు చేతి నిండా పని ఉండేది. పిల్లలను చదివించుకుంటూ కూలీ పనులు చేసేవాళ్లం. ఇప్పుడున్న పరిస్థితుల్లో పిల్లలను కూడా చదువులు మాన్పించే పరిస్థితి వచ్చింది. సీఎం రేవంత్ మా నియోజకవర్గమే అవ్వడంతో మా బతుకులు మారుతాయని ఓట్లు వేసి గెలిపించాం. కానీ రేవంత్ సర్కార్‌తో పోల్చితే కేసీఆర్ హయాంలోనే పేద ప్రజలు సంతోషంగా ఉన్నారు' అని రేవంత్ సొంత నియోజకవర్గానికి చెందిన కూలీలు నిట్టూర్చారు.

## వలవల ఏడ్చిన వలస కూలీలు.. విలవిలలాడిన చిన్నారులు





**కన్నీటి వ్యథ..** నీటి కోసం ఓ వలసకూలీ పడుతున్న తిప్పలివి..

**మాదాపూర్‌లోని సున్నం** చెరువులో హైడ్రా గుడిసెలను కూల్చివేసింది. ఉన్నపళంగా నీడ లేకుండా చేయడంతో వలస కూలీలంతా ఎటు వెళ్లాలో తోచక.. తమ పిల్లలతో కంటిమీద కునుకు లేకుండా అక్కడే ఉంటున్నారు. దుస్తులు అడ్డం కట్టుకొని వంటలు వండుకుంటున్నారు. పిల్లలను చూసుకుంటున్నారు. రాత్రంతా నిద్ర లేకపోవడంతో కొంతమంది చిన్నారులు అక్కడే ఏర్పాటు చేసుకున్న గణేశ్ మండపంలో నిద్రపోతూ కనిపించారు. హైడ్రా అధికారులు కనీసం ముందస్తు సమాచారం ఇచ్చి నాలుగు రోజులైనా సమయం ఇచ్చి ఉంటే..ఎక్కడికైనా వెళ్లి తలదాచుకునేవాళ్లమని బాధితులు ఆవేదనకు గురవుతున్నారు. 'ఇంటిని అద్దెకు అడిగితే ఒక్కొక్కటీ రూ. 10 నుంచి రూ. 15 వేల వరకు ఉన్నాయి. ఇంట్లో అందరూ కష్టపడితేనే మొత్తం వచ్చే సంపాదన అంతంత మాత్రమే. పిల్లలను చదివించుకుంటూ.. ఎలా బతికేదని' అంటూ బరువెక్కిన గుండెతో విలపిస్తున్నారు. వారి దుస్థితిని చూసిన స్థానికులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. రేవంత్ నియోజకవర్గం కొడంగల్‌కు చెందిన కూలీలే అధిక సంఖ్యలో ఉండగా, 'మా బతుకులు మారుతాయనుకొని రేవంత్‌ను గెలిపించాం.. ఇలా చేస్తాడని అనుకోలే'దంటూ..తమ బాధను వ్యక్తపరుస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో పేదలకు డబుల్ బెడ్రూంలు అయినా ఇచ్చారు. కానీ రేవంత్ సర్కార్ మాత్రం ఉన్న గుడిసెలు కూల్చి.. మమ్మల్నీ రోడ్డున పడేశారని కన్నీరుపెట్టుకున్నారు. తలదాచుకోవడానికి ప్రభుత్వమే ముందుకు వచ్చి తమకు ఏదైనా దారి చూపించాలంటున్నారు. తమకు వచ్చిన కష్టం పగ వారికి కూడా రాకూడదని కోరుకుంటున్నారు.

### ఇదేనా ప్రజాపాలన..

ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం పేదల నడ్డివిరుస్తోంది. ఆక్రమణల పేరిట బుల్డోజర్లతో వలస కూలీల జీవితాలను ఆగం చేస్తోంది. సున్నం చెరువు కూల్చివేతల అంశంలో హైడ్రా తీరు కంటే.. పేదల విషయంలో కాంగ్రెస్ వ్యవహరించిన విధానం ఆవేదనకు గురిచేస్తున్నది. అడ్డా కూలీలు, పేదలను సడిసప్పుడు లేకుండా తెల్లవారుజామున కూల్చివేతలతో భయభ్రాంతులకు గురి చేసింది. ఉన్నోళ్లకు నోటీసులు ఇచ్చి.. పేదోళ్లకేమో కనీస సమయం ఇవ్వకుండా.. గుడిసెలను నేలమట్టం చేసి.. నిరుపేదల బతుకులను ఆగం చేసిందంటూ..నగరవాసులు కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడుతున్నారు.



**గూడు కూల్చి.. గోడు మిగిల్చి..**

## అవినీతిపై ఫిర్యాదుల వెల్లువ!
# విద్యుత్ అధికారుల్లో గుబులు

సీఎండీ కార్యాలయంలో ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు
ప్రతి రోజూ 10-15 కాల్స్
వేగంగా విచారణ.. వెంటనే చర్యలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): విద్యుత్ శాఖలో అవినీతి మితిమీరిన స్థాయికి చేరింది. ఉన్నతాధికారులు మొదలు కొని కింది స్థాయి ఉద్యోగుల వరకు పదుల సంఖ్యలో ఏసీబీ అధికారుల వలకు చిక్కుతున్నారు. అయినా కొందరిలో మార్పు రావడం లేదు. ఈ నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఖైరతాబాద్‌లోని కార్పొరేట్ కార్యాలయంలోనే అవినీతి ఫిర్యాదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రానికి ప్రతి రోజూ 10 నుంచి 15 వరకు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. విద్యుత్ శాఖలో అధికారులు ఎవరైనా పనికి లంచం అడిగితే ఫిర్యాదు చేయవచ్చని, ఇందుకోసం సీఎండీ కార్యాలయంలో అవినీతి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెబుతూ..రెండు ఫోన్ నంబర్లు ఇచ్చారు. విద్యుత్ సంస్థలో సిబ్బంది, అధికారులు ఏదైనా పనికి లంచం అడిగితే ఫిర్యాదు చేసే వ్యవస్థను సీఎండీయే ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుండటంతో ఒక్కసారిగా డిస్కం పరిధిలోని ఆపరేషన్స్ విభాగంలో వణుకు మొదలైంది. ఇప్పటి వరకు అడ్డగోలుగా డబ్బులు డిమాండు చేస్తూ పనులు చేసిన అధికారులకు ఇప్పుడు కంటి మీద కునుకు ఉండటం లేదు.

### ఉద్యోగుల్లో భయం

గతంలో చేసిన అవినీతి పనులపైనా వినియోగదారులు ఫిర్యాదు చేస్తే తమ పని అంతే అన్న భావనలో కొందరు కొట్టుమిట్టాడుతున్నారు. ఫిర్యాదు రాగానే వేగంగా విచారణ చేపట్టి..చర్యలు తీసుకుంటుండడంతో వినియోగదారులు ఎక్కడ తమ పేర్లు చెబుతారోనన్న భయాందోళన అవినీతిపరుల్లో నెలకొన్నది.ఇటీవల వివిధ కారణాలపై నలుగురు విద్యుత్ అధికారులపై సీఎండీ క్రమ శిక్షణా చర్యలు తీసుకోవడంతో అవినీతిపరులు వణికిపోతున్నారు.

**అవినీతి ఫిర్యాదు కేంద్రం నంబర్లు..**
ల్యాండ్ నంబర్: **040-2345 4884**
మొబైల్ నంబర్: **7680901912**




నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

## హ్యాండిల్ లాక్ చేతితో విరగొట్టి..
# ద్విచక్రవాహనాల చోరీ

నిందితుడి అరెస్టు.. 59 వాహనాలు స్వాధీనం

బేగంపేట్, సెప్టెంబర్ 11: పార్కింగ్ ప్రదేశాలను లక్ష్యంగా చేసుకొని ద్విచక్ర వాహనాలను తస్కరిస్తున్న కరుడుగట్టిన దొంగను, ఇద్దరు బైక్ రీసివర్లను బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. 59 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకొని.. నిందితులను రిమాండ్‌కు తరలించారు. బుధవారం బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ ఇన్‌స్పెక్టర్ రామయ్యతో కలిసి వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణం మంచుకుంటినగర్‌కు చెందిన రాయుడు చైతన్యసాయికుమార్ 2013లో పాల్వంచ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చదువుతూ.. మధ్యలోనే మానేశాడు. జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి వివిధ ప్రైవేట్ సంస్థల్లో పనిచేశాడు. జల్సాలకు, వ్యసనాలకు అలవాటు పడిన సాయికుమార్ ఎక్కడా సరిగ్గా పని చేసే వాడు కాదు. దీంతో యజమానులు తొలగిస్తుండే వారు. ఈ క్రమంలో తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం ద్విచక్రవాహనాలు దొంగిలించడం ప్రారంభించాడు. ఒంటరిగా వెళ్తూ.. మెట్రో పార్కింగ్, రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌ల వద్ద పార్కింగ్ స్థలాల్లో ద్విచక్ర వాహనాలను హ్యాండిల్ లాక్‌ను చేతితో విరగొట్టి మారు తాళంతో వాహనాలను దొంగిలిస్తున్నాడు. ఆ వాహనాలను వెంటనే విక్రయించకుండా దూరంగా ఉన్న మరో పార్కింగ్ స్థలంలో పెట్టేవాడు. అలా పెట్టిన వివరాలను రిసీవర్లకు చెప్పి.. బైక్ అవసరం ఎవరికీ ఉందో తెలుసుకునే వాడు. వాహనం అమ్మే సమయంలో తాను దాచిన పార్కింగ్ స్థలం నుంచి వాహనాన్ని తీసుకుపోయి విక్రయించేవాడు. ఇలా గతంలో ఉప్పల్, చౌటుప్పల్, మాదాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 27 ద్విచక్రవాహనాలను దొంగలించాడు. ఈ కేసుల్లో ఉప్పల్ పోలీసులు సాయికుమార్‌ను అరెస్టు చేసి జైలుకు కూడా పంపారు. మూడు నెలల కిందట జైలు నుంచి వచ్చిన సాయికుమార్.. తన పద్ధతిని మార్చుకోకుండా తిరిగి దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 17, సైబరాబాద్ పరిధిలో 18, రాచకొండ పరిధిలో 19 వాహనాలను చోరీ చేశాడు. ఓ చోరీ కేసు వివరాలను సీసీ ఫుటేజీలో బేగంపేట పోలీసులు పరిశీలిస్తుండగా, సాయికుమార్ బైక్ దొంగలిస్తూ కనిపించాడు. అతడి నేర చరిత్ర ఆధారంగా పట్టుకున్నారు. సాయికుమార్‌తో పాటు ఇద్దరు రిసీవర్లు జగదీష్, కుంచాల హరికృష్ణను కూడా అరెస్టు చేశారు.

## వ్యర్థాలు తొలగించాలి..
# రోడ్లు శుభ్రంగా ఉండాలి

కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): గణేశ్ ఉత్సవాల సందర్భంగా నిమజ్జనం జరిగే ప్రదేశాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి జోనల్ కమిషనర్లను ఆదేశించారు. బుధవారం అడిషనల్, జోనల్ కమిషనర్లు, ఇతర విభాగాల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గణేశ్ నిమజ్జనం ఉన్న నేపథ్యంలో శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో రోడ్డుపై పడిన చెత్త, ఇతర వ్యర్థాలు వెను వెంటనే తొలగించేందుకు శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని, అవసరమైతే అదనంగా శానిటేషన్ కార్మికులను ఏర్పాటు చేసి.. రోడ్లు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డార్క్ స్పాట్స్ లేకుండా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనాన్ని పురస్కరించుకొని శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్లపై పాట్‌హోల్స్ పూడ్చాలని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

### హెచ్-సిటీ ప్రతిపాదనలను కార్యరూపంలోకి తీసుకురండి

వరద ముంపు నివారణలో భాగంగా హెచ్-సిటీ ప్రతిపాదనలను కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు కమిషనర్ ఆమ్రపాలి ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఇంజినీర్లతో కలిసి పర్యటించారు. అల్కాపురి జంక్షన్, ఫ్లై ఓవర్ ప్రతిపాదన, టీకేఆర్ జంక్షన్ నుంచి గాయత్రీ నగర్, మంద మల్లయ్య జంక్షన్ వరకు చేపట్టనున్న ఫ్లై ఓవర్ ప్రతిపాదనలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత ప్రాజెక్టుల ఆవశ్యకతను ప్రాజెక్టు సీఈ దేవానంద్ కమిషనర్‌కు వివరించారు.



అధికారులకు సూచనలిస్తున్న బల్దియా కమిషనర్ ఆమ్రపాలి



# ఒత్తిడి లేకుండా.. అప్రమత్తంగా ఉండండి

సిటీ సీపీ దిశానిర్దేశం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ)/మెహిదీపట్నం: సామాన్యులను ఇబ్బందులకు గురి చేయకుండా గణేశ్, మిలాద్ ఉన్ నబీ పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. బుధవారం మెహిదీపట్నంలోని దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ కార్యాలయంలో సౌత్ వెస్ట్ జోన్‌లోని శాంతిభద్రతలు, ట్రాఫిక్, ఎస్బీ, టాస్క్‌ఫోర్స్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల నుంచి ప్రస్తుతం గణేశ్, మిలాద్ ఉన్ నబీ పండుగల ఏర్పాట్లపై తీసుకుంటున్న చర్యలపై ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. విధుల నిర్వహణలో ఒత్తిడి లేకుండా ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.